క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీ, మండలంలోని ముండ్లపాడు, కె.ఎస్.పల్లె, కంచిపల్లె, బురుజుపల్లె, అంబవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెకంటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన సబ్‌కలెక్టర్



ఆధార్ క్యాంప్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మార్కాపురం రూరల్: మండలంలోని కోలభీమునిపాడు, గజ్జలకొండ-2 సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లను సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. గజ్జలకొండ-2లో 27 మంది, కోలభీమునిపాడులో 30 మంది ఆధార్ సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. బుధవారం జమ్మునపల్లిలో ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తోట చందన తెలిపారు.

అధార్ సేవలను వినియోగించుకోండి

కంభం: ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం డీఎల్‌డీఓ సాయికుమార్ అన్నారు. కందులాపురం-3 సచివాయలంలో జరుగుతున్న ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ సయ్యద్‌మస్తాన్‌వలితో కలిసి ఆయన పరిశీలించారు. జీరో నుంచి ఐదేళ్ల పిల్లలకు ఆధార్ అప్డేట్ చేయించడం, ఇతర మార్పులు, ఫోన్ నంబర్ లింక్ చేసుకోవడం వంటి సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. కందులాపురం-3, పెద్ద నల్లకాల్వ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామాన్ని శుభ్రంగా ఉంచుదాం



పొదిలి రూరల్: ఆరుబయట చెత్త వేయకుండా గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని ఈఓఆర్డీ కృష్ణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం పొదిలి మండలంలోని ఏలూరు పంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువల్లో పూడికతీత, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్‌పై దృష్టి సారించాలని కార్యదర్శులకు సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శేషగిరి, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

రాచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని ఇవ్వాలని ఎంఈవో వారణాసి గిరిధరశర్మ అన్నారు. మండలంలోని గుడిమెట్ట యూపీ స్కూల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారమై రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేయాలని వివరించారు. ప్రభుత్వ సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు విద్యార్థులకు ఇచ్చారా లేదా అనే విషయాన్ని పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న బాత్ రూమ్‌లను పరిశీలించి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఎంఈవో-1 కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన



బాలికలతో మాట్లాడుతున్న అధికారులు

పొదిలి: పట్టణంలోని వసతి గృహాలను మండల స్థాయి అధికారులు మంగళవారం సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. వసతి గృహాల్లోని సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. బీసీ, ఎస్సీ వసతి గృహాలకు ట్యాంకర్ల ద్వారా అవసరమైన నీటిని సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ చంద్రశేఖరరెడ్డి చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తహసీల్దార్ జియాఉల్‌హక్, మెడికల్ ఆఫీసర్ శరత్‌బాబు, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

షాక్ కొడుతున్న ప్రభుత్వ కార్యాలయాలు



ఉద్యానశాఖ అధికారి టేబుల్ చుట్టూ చెమ్మగా ఉన్న గోడలు



ఒకే గదిలో ఉద్యాన శాఖ, మత్స్యశాఖ కార్యాలయాలు

కంభం: ఇటీవల కురిసిన వర్షానికి ఉద్యానవన శాఖ కార్యాలయంలో నీటి చెమ్మతగిలి కరెంటు బోర్డు షాక్ కొడుతుండంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రైతులతో సమావేశం ముగించుకున్న అనంతరం ఉద్యానవన అధికారి డి.శ్వేత తన కార్యాలయంలోకి వెళ్లి కుర్చీలో కూర్చొని వెనుక ఉన్న కరెంటు బోర్డులో ఫ్యాను వేసేందుకు ముట్టుకోగా ఒక్క సారిగా షాక్ కొట్టడంతో ఆమె భయపడి లోపలి నుంచి బయటకు వచ్చేశారు. ఉద్యానవన శాఖకు సొంత భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖకు చెందిన గోడౌను లోనే వారి కార్యకలాపాలు కొనసాగించుకుంటున్నారు. ఇటీవల కాలంలో మత్యశాఖ సిబ్బందికి కూడా అదే గోడౌనులో ఒక పక్క పార్టేషన్ చేసి కేటాయించారు. అసలే శిథిలావస్థకు చేరిన భవనం పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతుందో అర్థం కాని పరిస్థితి. ఈ నేపథ్యంలో వారం రోజులుగా కురిసిన వర్షానికి గదిలోకి నీరు ప్రవేశించింది. గోడలు మొత్తం చెమ్మగా మారిపోయాయి. ప్రమాదం జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సిబ్బందితో పాటు కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ జిల్లా ఎడ్ల సత్తా



రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కామూరి అమూల్య

కొమరోలు: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని బాదినేనిపల్లెలో మంగళవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీపీ కామూరి అమూల్య ప్రారంభించారు. పోటీలలో 12 జతల ఎడ్లు పాల్గొనగా వైఎస్ఆర్ కడప జిల్లా పొత్తురెడ్డిపల్లె గ్రామానికి చెందిన మూల సూరారెడ్డి ఎడ్ల జత 4033 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.40వేలు గెలుచుకుంది. వైఎస్ఆర్ కడప జిల్లా బాలయ్యగారిపల్లె గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి ఎడ్ల జత 4000 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ బహుమతి రూ.30వేలను, వైఎస్ఆర్ కడప జిల్లా రాజువారిపేట, పొత్తురెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఎడ్ల జతలు 3421 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి రూ.2 0వేలను సాధించింది. అదే జిల్లా గుడిపాడు గ్రామానికి చెందిన తుమ్మల నారాయణరెడ్డి ఎడ్ల జత 3240 అడుగుల దూరం బండను లాగి నాల్గవ బహుమతి రూ.15వేలను గెలుపొందగా నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామానికి చెందిన పెద్ది శివకాంతరెడ్డి ఎడ్ల జత 3200 అడుగుల దూరం బండను లాగి రూ.10వేలు నగదు బహుమతి సాధించారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నాటుసారాను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొంగలవీడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కోసం వినియోగించే 200 లీటర్ల బెల్లం ఊటను మంగళవారం స్థానిక సెబ్ సీఐ ఎస్.కొండారెడ్డి తన సిబ్బందితో సహా వెళ్లి ధ్వంసం చేశారు. అందిన సమాచారం మేరకు.. కొంగలవీడు ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్నారని తెలియడంతో సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. బెల్లం ఊటతో పాటు 30 కిలోల నల్లబెల్లం, 20 లీటర్ల నాటుసారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారు చేస్తున్న బురుజుపల్లెకు చెందిన నాసరి వెంకటేశ్వర్లు అనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. నాటుసారా తయారీని గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

నంబర్ ప్లేట్ మారిస్తే కఠిన చర్యలు

రాచర్ల: మోటారు సైకిళ్లు, ఆటోలు, కార్, ఇతర వాహనాలకు ఆర్టీవో ఇచ్చిన నంబర్ ప్లేట్ మాత్రమే ఉండాలని, ఇతర నంబర్ ప్లేట్స్ వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఇమ్మానియేల్ హెచ్చరించారు. అంతేగాక మద్యం తాగి వాహనాలు నడపడం, మోటార్ సైకిల్‌పై ఇద్దరికి మించి ప్రయాణించడం, రాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. మోటారు సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలని వివరించారు. 18 సంవత్సరాల పిల్లలకు మోటారు సైకిళ్లు ఇవ్వకూడదని, వ్యాపారులు తమ షాపుల ఎదుట వాహనాలు పార్కింగ్ చేయకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని తెలిపారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడి పందాలు గురించి సమాచారం తెలిస్తే గిద్దలూరు సీఐ 91211 02187, రాచర్ల ఎస్సై 91211 02191, పోలీష్ స్టేషన్ 91548 80855 సెల్‌ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యం



సభ్యత్వ నమోదు చేస్తున్న జేవీవీ నాయకులు

మార్కాపురం టౌన్: సామాన్య ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని సంఘ నాయకుడు ఏనుగుల రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో జేవీవీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞాన ప్రచారం, జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు జేవీవీ చేస్తున్న కృషిని వివరించారు. జేవీవీ సభ్యులు జి.ముక్తేశ్వరరావు, అధ్యాపకులు బి.నారాయణ, వనజ, ఎం.శ్రీనివాసరెడ్డి, పి.నవీన్, పీవీ ఆంజనేయులు, భానుకుమార్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమంలో తిలక్ పాత్ర మరువలేనిది



తిలక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తర్లుపాడు: మండలంలోని లక్ష్మక్కపల్లి ఎంపీపీ పాఠశాలలో బాలగంగాధర్‌తిలక్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.జగన్‌బాబు మాట్లాడుతూ.. భారత స్వాతంత్రోద్యమంలో బాలగంగాధర్ తిలక్ పాత్ర మరువలేనిదన్నారు. ఆంగ్లేయుల కింద బానిసగా పనిచేయడం ఇష్టంలేక తిలక్ ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేశారని చెప్పారు.దేశభక్తిని చాటుతూ ప్రజలను చైతన్యపరిచిన తిలక్ జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అబ్దుల్ షుకూర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ జిల్లా స్థాయిలో కొనసాగిస్తాం

● రిలే నిరాహార దీక్షలు విరమించిన ఆర్టీసీ ఉద్యోగులు



మాట్లాడుతున్న బెజవాడ రవి

పొదిలి: ఆర్టీసీ ఉద్యోగులు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం, స్థానిక డిపోలో యాజమాన్యం పక్షపాత వైఖరికి నిరసనగా గత తొమ్మిది రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షను మంగళవారం విరమించారు. ఈ సందర్భంగా జోనల్ జాయింట్ సెక్రటరీ బెజవాడ రవి మాట్లాడుతూ.. రీజినల్ కమిటీ బాధ్యతలు తీసుకుని ఉద్యమ కార్యాచరణను ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. జిల్లా స్థాయిలో సమస్యలను రీజినల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పొదిలి డిపోలోని సమస్యలపై, పక్షపాత వైఖరిపై ఆర్ఎంకు మెమొరాండం అందజేసి కార్యాచరణ కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం నిరాహారదీక్షలో ఉన్న యు.నాగేశ్వరరావు, పోలయ్య, ఎంజే జిలానీ, టి.గంగయ్యకు రీజినల్ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, బెజవాడ రవి, రాష్ట్ర మెయింటెనెన్స్ కార్యదర్శి కొండలు నిమ్మరసం అందచేసి దీక్షలు విరమింపజేశారు. దీక్షలో పాల్గొన్న సభ్యులకు, మద్దతు తెలిపిన ఉద్యోగులకు, సహకరించిన అందరికీ డిపో కార్యదర్శి ఓబులేసు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి

● జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మధుబాబు



మాట్లాడుతున్న ఐఆర్ఎస్ అధికారి మధుబాబు

పొదిలి: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్య సాధన దిశగా ముందడుగు వేయాలని ఐఆర్ఎస్ అధికారి, జీఎస్టీ అండ్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మధుబాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. జీవన నైపుణ్యాలను పెంపొందించుకుని, లక్ష్య సాధన కోసం కృషి చేయాలని సూచించారు. మధుబాబు కుమార్తె ఎస్.సాహితి మాట్లాడుతూ.. జీవితంలో ఏదైనా సాధించాలనే నమ్మకంతో ముందుకు సాగాలని సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగోలో తాను పబ్లిక్ పాలసీలో అంతర్జాతీయంగా రెండో ర్యాంకు సాధించేందుకు చేసిన కృషిని సాహితి వివరించారు. గత ఏడాది బైపీసీలో ప్రతిభ కనపరిచిన డి.కాలేబును ఎం.శ్యామ్యూల్ శేఖర్ చేతుల మీదుగా సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో ఆశీర్వాదం ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ బి.జయానందం, ప్రిన్సిపాల్ తారావాణి. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులకు హాజరు కాకుంటే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి

కొమరోలు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి బుధవారం నుంచి విధులకు హాజరుకాని పక్షంలో సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తానని జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి హెచ్చరించారు. గత 20 నెలలుగా కొమరోలు గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు నిరసన దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి మంగళవారం కొమరోలు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని విధులకు గైరుహాజరైన పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ 20 రోజులుగా సెలవులో ఉన్న విషయం తెలుసుకున్న డీపీఓ ఉషారాణి ఇన్ని సమస్యలు పెట్టుకుని ఎలా సెలవుపై వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుపై వెళ్లిన కార్యదర్శి భార్య ఈశ్వరి అదే కార్యాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విషయం తెలుసుకున్న ఉషారాణి ఆమెను పిలిపించి బుధవారం లోపు పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టాలని, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే సస్పెండ్ చేయిస్తానని హెచ్చరించారు.

పండ్ల తోటలపై అవగాహన

తర్లుపాడు: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంపై మండలంలోని రైతులకు ఉద్యాన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఎన్ఆర్ఈజీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కర్‌రావు మాట్లడుతూ.. సన్న, చిన్నకారు రైతులకు పండ్ల తోటలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మొక్క నాటిన దగ్గర నుంచి మూడేళ్లపాటు మెయింటెనెన్స్ ఖర్చులు అందజేస్తామన్నారు. ఫీల్డు అసిస్టెంట్‌ను లేదా ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, హార్టికల్చర్ అధికారి రమేష్, కోర్సు డైరెక్టర్ రాజేష్, ఏపీఓ చిన్న కొండయ్య, ఈసీ పెద్దయ్య, టీఎలు పాల్గొన్నారు.

ఐదు రోజులు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

పొదిలి రూరల్: పొదిలి మండలంలో మంగళవారం నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజులపాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ పీటీవీ కృష్ణ తెలిపారు.మంగళవారం తలమళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటరును ఆయన పరిశీలించారు. 24న మూగచింతల గ్రామంలో మూగచింతల, కొండాయపాలెం, సలకనూతల, ఓబులక్కపల్లి ప్రజలకు, 25న మల్లవరంలో జువ్వలేరు, మల్లవరం, అక్కచెరువు, కొస్టాలపల్లి, 26న పాములపాడులో ఈగలపాడు, పాములపాడు, కుంచేపల్లి, దాసళ్లపల్లి, గొల్లపల్లి, 27న సూదనగుంటలో గురుగుపాడు, తుమ్మగుంట, సూదనగుంట, రామాపురం ప్రజలకు ఆధార్ సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శేషగిరి, మహిళా పోలీస్ లక్ష్మి ఉన్నారు.

ఇంటింటికీ ఎల్‌సీడీసీ సర్వే

పొదిలి రూరల్: కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తునట్లు ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సుగుణకుమార్ పేర్కొన్నారు. మంగళవారం రామాపురంలో ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. అనుమానిత కుష్టు లక్షణాలు ఉన్నవారికి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామని, తద్వారా అంగ వైకల్యం బారిన పడకుండా నిరోధించవచ్చన్నారు. శరీరంపై మూడు మచ్చలు ఉన్న వారికి పాసివ్ బ్యాసిలరీ(పీబీ) విధానంలో ఆరు నెలలు, అలాగే ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలలపాటు చికిత్స అందిస్తామన్నారు. ఇందులో భాగంగా నెలకు ఒకసారి ఆయా రోగుల ఇళ్లకు వైద్య సిబ్బంది వెళ్లి మందులు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు రూరల్: విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలని పట్టణ వైద్యాధికారి డాక్టర్ షరీఫ్ అన్నారు. జ్వర సర్వే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అర్బన్ కాలనీలో మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్లకు వద్దకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పరిసర ప్రాంతాలు మురికి మయమై దోమలు విజృంభిస్తున్నాయని, వాటి ద్వారా జ్వరాలు ప్రబలుతాయన్నారు. జ్వరాలు రాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డాక్టర్ భార్గవ్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుధారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

మార్కాపురం: ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని కోర్టు ఆవరణలోని క్యాంటీన్ వద్ద మంగళవారం కొండచిలువ కలకలం రేపింది. పెద్ద కొండచిలువలతో పాటు మరో ఐదు కొండచిలువ పిల్లలు కూడా సంచరిస్తుండటంతో ఒక్కసారిగా సిబ్బందితో పాటు కక్షిదారులు కూడా ఆందోళన చెందారు. కోర్టు సిబ్బంది స్నేక్ క్యాచర్ నిరంజన్‌కు సమాచారం ఇవ్వడంలో వచ్చి వాటిని పట్టుకొని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేశారు.

సాగు హక్కు పత్రాలతో కౌలు రైతులకు భరోసా

కొనకనమిట్ల: సాగు హక్కు పత్రాలతో భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులకు ఎంతో భరోసా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నాగరాజుకుంట రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందడం వల్ల ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు వర్తిస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో దర్శి వ్యవసాయ సంచాలకులు కె.బాలాజి నాయక్, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, వీఏఏలు, కౌలు రైతులు పాల్గొన్నారు.

తర్లుపాడు: కౌలు విధానంలో వ్యవసాయం చేస్తున్న తర్లుపాడులోని రైతులకు స్థానిక గ్రామ చావిడి వద్ద ఏఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కౌలు కార్డులు పొందేందుకు అవసరమయ్యే పత్రాల గురించి ఏఓ వివరించారు. కార్యక్రమంలో వీఆర్ఓ భాస్కర్‌రెడ్డి, వీఓ బాషా, వీఆర్ఏ చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఇచ్చింది గ్రాంటా.. అప్పా?

● కాంగ్రెస్ నేత జావీద్ అన్వర్

మార్కాపురం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు గ్రాంటా.. అప్పా.. అనే విషయం తేల్చాలని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ నేత సయ్యద్ జావీద్ అన్వర్ డిమాండ్ చేశారు. ఏపీ రాజధాని నిర్మాణానికి నేరుగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పకపోవడం శోచనీయమన్నారు. మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం అందిస్తామనడంలో కేంద్ర మంత్రి పేర్కొనడంలో ఆంతర్యాన్ని స్పష్టం చేయాలన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు ఎంత మేరకు సాయం చేస్తారనే విషయంలోనూ స్పష్టత లేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఎన్ని నిధులిస్తారో పేర్కొనకపోవడం శోచనీయమన్నారు. బీహార్ రాష్ట్రానికికే అత్యధిక నిధులు కేటాయించి ఏపీకి మొండి చేయి చూపారని, బడ్జెట్ ఆశాజనకంగా లేదని విమర్శించారు.

హాస్టల్స్‌లో అపరిశుభ్రతపై తహసీల్దార్ ఆగ్రహం



హాస్టల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామయ్య

కంభం: హాస్టల్స్‌లో పరిశుభ్రత పాటించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తహసీల్దార్ రామయ్య హెచ్చరించారు. సోమవారం రాత్రి పట్టణంలో ప్రభుత్వ హాస్టల్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో అపరిశుభ్ర వాతారవణం ఉండటం, కనీస శుభ్రత పాటించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలని, మరుగుదొడ్లు, పరిసరాలు, నీటి ట్యాంక్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రెండు రోజుల తర్వాత తనిఖీకి వస్తానని, అప్పటిలోగా సరిచేసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉద్యాన పంటలు సాగు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని రైతులు ఉద్యానవన పంటలు సాగు చేసుకోవడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పంపకంపై రైతులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ రైతులు ఏ పంటలు సాగు చేసుకున్నా ముందుగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకొని అందులో వచ్చిన ఫలితాల ఆధారంగా ఏ పంటలు సాగు చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయే తెలుసుకొని వాటిని సాగు చేసుకోవాలన్నారు. రైతులు ఉద్యానవ పంటలపై ఆసక్తి పెంచుకుంటూ తెలియనివారికి తెలియజేస్తూ సాగు చేసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలు అందజేయడంతో పాటు రవాణా ఖర్చులు భరిస్తోందన్నారు. అనంతరం ఉద్యానవన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై ఉద్యానవనశాఖాధికారి డి. శ్వేత రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఏపీఓ ఏడుకొండలు, రైతులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ రమేష్

రాచర్ల: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని దర్శి ఏరువాక కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ అన్నారు. మండలంలోని చోళ్లవీడులో రైతులు సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా సాగు చేసే పత్తి పంట గురించి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడితే సూక్ష్మ పోషకాలు లోపించి, పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుందన్నారు. పత్తిలో పచ్చదోమ, తామర పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4 ఎంఎల్ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 ఎంఎల్‌ను లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలని చెప్పారు. సబ్సిడీపై సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొర్ర, ఆముదము పంటల్లో యాజమాన్య పద్ధతులను రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం చోళ్లవీడులో రైతులు సాగు చేసిన పత్తి, కొర్ర, ఆముదము పంట పొలాను పరిశీలించారు. గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీనాయక్, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, వ్యవసాయా విస్తరణాధికారి బి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

అసిటామిప్రిడ్‌తో పచ్చదోమ నివారణ

బేస్తవారిపేట: పత్తి పంటలో పచ్చదోమ, తామర పురుగు నివారణకు అసిటామిప్రిడ్ లీటర్ నీటికి 0.2 గ్రాములు లేక ఇమిడాక్లోపిడ్ 0.2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పచికారీ చేయాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని జేబీకే పురంలో పత్తి, పచ్చిరొట్టి పైర్లను పరిశీలించారు. పొలం గట్ల వెంట కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర పైర్లతో భూమి సారవంతం అవుతుందన్నారు. సేంద్రియ కర్బన శాతం పెరగడంతో రసాయన ఎరువులు వాడకం తగ్గుతుందన్నారు. పచ్చిరొట్ట పంటలను పూత దశలో భూమిలో కలియ దున్నడంతో వాటిలోని పోషకాలు నత్రజని, భాస్వరం, పొటాష్ నేలలో కలిసి పంట ఏపుగా పెరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, వీఏఏ జుబేద్, రైతులు పాల్గొన్నారు.